'హ్యాట్రిక్' హీరో కేపీ వివేకానంద్

భారీ మెజార్టీ విజయం.. కార్యకర్తల్లో ఉత్సాహం

- వివేకానంద్ గెలుపుతో బీఆర్ఎస్ నాయకుల సంబురాలు
- రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ (85,576)తో గెలిచిన అభ్యర్థిగా రికార్డ్
- నా విజయం కుత్బుల్లాపూర్ ప్రజలకు అంకితం: వివేకానంద్



ఎమ్మెల్యేగా వివేకానంద్ ముచ్చటగా మూడోసారి ఎన్నికలో 'హ్యాట్రిక్' సాధించారు. గతంలో మేడ్చల్‌లో అంతర్భాగంగా ఉన్న కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ 2009లో నియోజకవర్గంగా ఏర్పడింది. ఈ క్రమంలో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా కూన శ్రీశైలంగౌడ్ గెలుపొందారు. తర్వాత 2014, 2018, 2023 వరుసగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన వివేకానంద ఘన విజయం సాధిస్తూ వచ్చారు. గడచిన ఎన్నికల్లో 41,500 మెజార్టీ రాగా తాజాగా ఏకంగా 85,576 మెజార్టీతో విజయం సాధించి చరిత్ర సృష్టించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా భారీ మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు నెలకొల్పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అనూహ్యంగా కాంగ్రెస్, బీజేపీ బలమైన అభ్యర్థులు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన వివేకానంద్ తనదైన శైలిలో పాదయాత్రల ద్వారా, స్థానికంగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. ఈ క్రమంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఆయనకు ఘనవిజయం చేకూర్చి పెట్టారు. – కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్ ఘనవిజయం సాధించడంతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది.. గత నెల రోజులుగా విస్తృత ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కలిసి సూరారం కట్ట మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా చింతల్ పార్టీ కార్యాలయానికి వచ్చి ఈ విజయం కుత్బుల్లాపూర్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివేకానంద ప్రకటించారు.

◆ హ్యాట్రిక్ ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటా..

తనపై నమ్మకంతో హ్యాట్రిక్ విజయం చేకూర్చిన ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. సుమారు రూ.6వేల కోట్ల నిధులతో కుత్బుల్లాపూర్ రూపురేఖలు మార్చానన్నారు. తద్వారా ప్రజల్లో ఉంటూ ముందుకు సాగానన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని అభివృద్ధి మౌలిక వసతులు కల్పించడం మూలంగానే నన్ను ఆదరించి గెలిపించారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ ఇచ్చిన తనకు మీ సహాయ సహకారాలు ఇలాగే ఉండాలని కోరారు.

◆ రికార్డు విజయంతో ఆనందోత్సవాలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వివేకానంద్ రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 85,576 మెజార్టీ ఓట్లు కార్యకర్తల్లో జోష్ పెంచింది. అది నుండి ఎమ్మెల్యేకు వెన్నంటి ఉండేవారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒక టీమ్ స్పిరిట్‌తో ముందుకు సాగుతూ తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్‌కు రెండు సంవత్సరాలుగా పార్టీ కార్పొరేటర్లు దూరం ఉన్నప్పటికీ చివరికి మంత్రి కేటీఆర్ చొరవతో ఎట్టకేలకు ఎన్నికల్లో ఎమ్మెల్యేతో కలిసి ప్రచారం చేశారు. అంతకుముందే తనకంటూ ఒక వర్గాన్ని ద్వితీయ శ్రేణి నాయకులను ఎంపిక చేసుకొని డివిజన్ల వారీగా పక్క ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగడంతో ఈ భారీ విజయం చేకూరిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ వివేకానంద్‌దే హవా..

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో సైతం వివేకానంద్ హవా కొనసాగింది. మొత్తం 1884 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్‌కు 672 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డికి 670, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు 496 ఓట్లు పడ్డాయి. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో సైతం వివేకానంద్ పైచేయి సాధించారు.

ఈ ఇద్దరూ హ్యాట్రిక్ వీరులే..



విజయ సంకేతం చూపుతున్న ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు

కుత్బుల్లాపూర్: ఆదివారం వెలువడిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఫలితాల్లో కుత్బుల్లాపూర్ నుంచి వివేకానంద్, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావులు ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేలుగా హ్యాట్రిక్ విజయం సాధించారు. దీంతో ఫలితం వెలువడిన వెంటనే ఇరువురు ఎమ్మెల్యేలు పార్టీ కార్యకర్తలు అభిమానులతో కలిసి గెలుపొందిన ఆనందాన్ని పంచుకున్నారు. ఇరువురు గతంలో టీడీపీ నుంచి గెలిచి అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు.

ఒకటి నుంచి 22వ రౌండ్ వరకు వివేకానంద్ ఆధిపత్యం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో కేపీ వివేకానందగౌడ్ (బీఆర్ఎస్)కు 1,87, 999 ఓట్లు, కూన శ్రీశైలంగౌడ్(బీజేపీ)కు 1,02,423 ఓట్లు, కొలన్ హన్మంత్‌రెడ్డి (కాంగ్రెస్)కు 1,01,554 ఓట్లు రాగా 85,576 ఆదిక్యంతో బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానందగౌడ్ సమీప బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై ఘన విజయం సాధించారు. ఒకటో రౌండ్ నుంచి 22 రౌండ్ వరకు ఎక్కడా తగ్గకుండా ప్రతి రౌండ్‌లో ఆధిక్యత కనబరిచి వివేకానంద పట్టు నిలుపుకుని హ్యాట్రిక్ నమోదు చేసుకున్నారు. అయితే 20 రౌండు వరకు రెండో స్థానంలో కొనసాగిన కాంగ్రెస్ అభ్యర్థి హన్మంత్ రెడ్డి చివరి రెండు రౌండ్లలో వెనక్కి తగ్గడంతో అనూహ్యంగా రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ వచ్చారు. ఫలితం ప్రకటించే సమయానికి రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు.

టీఆర్ఎస్ పేరు మార్పే ఓటమికి కారణం

బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నాయకుడు మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: టీఆర్ఎస్ పార్టీ పేరు మార్పు విషయమే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని... బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటుతో తెలంగాణ అస్తిత్వం కోల్పోయినట్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహరించారని.. అందుకే ప్రజలు ఆ పార్టీని ఓడించారని బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నాయకుడు మదన్‌గౌడ్ అన్నారు. పది సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రజలను ఏనాడు కలిసింది లేదన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిరోజు ప్రజా దర్బార్ పేరిట ప్రజలను కలుస్తూ వచ్చారన్నారు. అందుకు భిన్నంగా కేసీఆర్ వ్యవహరించడం మూలంగా తగిన విధంగా ప్రజలు తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.

నోటాకు పెరిగిన ఓట్లు

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో నోటా ఓట్లు పెరుగుతూ వస్తున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2 లక్షల 89 వేల 368 ఓట్లు పోలు కాగా 2,976 మంది నోటా గుర్తుపై ఓటేశారు. తాజాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 4,01,667 ఓట్లు నమోదు కాగా 4,079 మంది నోటాపై ఓటేశారు. దీంతో మొత్తం పోలైన ఓటర్లలో 1.01 శాతం ఓటర్లు ఏ ఒక్క పార్టీ అభ్యర్థిపై మొగ్గు చూపకుండా నోటాపై ఓటేయడం గమనార్హం.

13మంది అభ్యర్థులపై గెలిచిన నోటా

నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన వైనం

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో నోటా ఓట్లు అభ్యర్థులను సైతం ఓడించాయి. మొత్తం 16 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవగా బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్‌కు 1,87,327 ఓట్లు, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్‌కు 1,01,927 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డికి 1,00884 ఓట్లు పడ్డాయి. అయితే మొత్తం 4,0,1667 ఓట్లు పడగా అందులో నోటా ఓట్లు 4073 ఉన్నాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన 13 మంది అభ్యర్థులకు నోటాకు పడిన ఓట్లు సైతం రాకపోవడం గమనార్హం. బీఎస్పీ అభ్యర్థి అహ్మద్ లిమ్రాకు 1751 ఓట్లు, సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి అభ్యర్థి మేకల కార్తీక్‌యాదవ్‌కు 745 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు సాయికుమార్ పంతులాకు 598 ఓట్లు, బాగిలి శ్రీనివాస్‌రెడ్డికి 501 ఓట్లు పడాయి. మిగతా అభ్యర్థులకు ఓటాకు పడిన ఓట్లలో పది శాతం ఓట్లు కూడా పడలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థులపై నోటా అధికృత ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనబడింది.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు నుంచి ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న వివేకానంద్



సూరారం కట్టమైసమ్మ ఆలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

విజయోత్సాహం

- కేపీ వివేకానంద్ గెలుపుతో గులాబీ శ్రేణుల సంబురాలు
- సూరారం నుంచి షాపూర్‌నగర్ విజయోత్సవ ర్యాలీ

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోకజవర్గ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన వివేకానంద్‌కు బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం కౌంటింగ్ కేంద్రం నుంచి కుత్బుల్లాపూర్‌కు చేరుకున్న ఎమ్మెల్యేకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, జగన్‌లు ఎమ్మెల్యే వివేకానంద్‌ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సూరారంలోని కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అక్కడ నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు సంబురాల్లో పాల్గొన్నారు. సూరారం నుంచి షాపూర్‌నగర్ వరకు బీఆర్ఎస్ కార్యకర్తల ర్యాలీతో రోడ్లన్నీ గులాబీమయం అయ్యాయి.

దుండిగల్: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ హ్యాట్రిక్ విజయం సాధించడంలో ఆ పార్టీ నేతల్లో సంబరాలు అంబరాన్నంటాయి. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. బాణాసంచా కాలుస్తు.. స్వీట్లు పంచారు. రంగులు చల్లుకుంటు ఆనందం వ్యక్తం చేశారు.



బాలయ్యనగర్‌లో కార్యకర్తల సంబరాలు..



ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్న వివేకానంద్



సంబరాల్లో మునిగి తేలిన బీఆర్ఎస్ కార్యకర్తలు

కుత్బుల్లాపూర్‌లో రౌండ్ల వారీగా వివరాలు

ఆదివారం జరిగిన కౌంటింగ్‌లో బీఆర్ఎస్ పార్టీ ప్రతి రౌండ్‌లో స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. రౌండ్ రౌండ్‌కు వేలల్లో లీడ్ పెంచుకుంటూ పోయింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ రాష్ట్రంలోనే 85 వేలకు పైగా ఓట్లు సాధించి చరిత్ర సృష్టించారు. వివేకానంద్ (బీఆర్ఎస్), కూన శ్రీశైలంగౌడ్ (బీజేపీ), కొలన్ హన్మంత్‌రెడ్డి(కాంగ్రెస్) పార్టీల అభ్యర్థులకు ఆయా పార్టీల నుంచి పోలైన ఓట్లు ఈ క్రింది విధంగా ఉన్నాయి. – దుండిగల్

రౌండ్	వివేకానంద్ (బీఆర్ఎస్)	శ్రీశైలంగౌడ్ (బీజేపీ)	హన్మంత్‌రెడ్డి (కాంగ్రెస్)	మెజార్టీ
01	9789	5465	6206	3583
02	9801	6519	6627	3174
03	8616	5286	6212	2404
04	7619	4041	6295	1324
05	8019	4243	6468	1551
06	7451	3578	5899	1552
07	8919	3992	5609	3310
08	9119	3998	4632	4487
09	7338	5416	3732	1922
10	8593	5157	3334	3436
11	9525	3178	3229	6296
12	9536	4097	3468	5439
13	8796	5470	3606	3326
14	9733	5343	3501	4390
15	10583	4518	4344	6065
16	8274	3939	4297	3977
17	8639	4826	4482	3813
18	9512	5077	5110	4402
19	10362	5732	5120	4630
20	8157	5197	4336	2960
21	8418	6347	4075	2071
22	528	508	302	20
మొత్తం	1,87,999	1,02,423	1,01,554	85,576

(బ్యాలెట్ ఓట్లతో కలిపి)

కాంగ్రెస్ సంబురాలు



నిజాంపేట్‌లో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు

రంగారెడ్డినగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఆనందోత్సవాల మధ్య సంబరాలు జరుపుకున్నారు.నిజాంపేట్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, గాజులరామారంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శౌంతిరెడ్డి పున్నారెడ్డిల ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. అదే విధంగా సుచిత్రలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ-ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇది తెలంగాణ రాష్ట్ర చరిత్రలో పార్టీకి గొప్ప విజయమని, నిరంకుశ పాలనపై ప్రజాస్వామ్య విజయమని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు పరుస్తామని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆదివారం యువ నాయకుడు కేపీ విశాల్‌గౌడ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్న అనంతరం విశాల్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, రాష్ట్రంలో మన ప్రభుత్వమే అధికారంలోకి వచ్చిందని, అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు.

మత్తులో నడిపి.. ఇద్దరిని ఢీకొట్టి

తీవ్రంగా గాయపరిచిన మందుబాబు



నిజాంపేట్: తాగిన మైకంలో కారు నడిపి నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతినగర్ ఆర్‌కే లేఅవుట్‌కు చెందిన తండ్రికుమారుడు తిరుపతి(60), హర్షిత్(30)లు ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ప్రగతినగర్ కమాన్ నుంచి మిథిలానగర్ వైపు నడుచుకుంటూ వస్తున్నారు. ఇదే క్రమంలో మిథిలానగర్ సర్కిల్ వద్ద వేగంగా వచ్చిన క్రెటా కారు (టీఎస్ 09ఎఫ్‌జీ8628) తండ్రికొడుకును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పల్టీ కొట్టగా కారు నడుపుతున్న శ్రీనివాస్ (50) సురక్షితంగా బయట పడ్డాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఈ ప్రమాదంలో తిరుపతి, హర్షిత్‌లకు తీవ్ర గాయాలు కాగా కేపీహెచ్‌బీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా కారు నడిపిన శ్రీనివాస్ మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కానరాని టీడీపీ, జనసేన ప్రభావం

- కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానానికి పరిమితం
- జనసేన అధినేత ప్రచారం చేసినా గట్టెక్కని బీజేపీ అభ్యర్థి

నిజాంపేట్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నగర శివారులోని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కుమ్మక్కైన చంద్రబాబునాయుడు తెలంగాణలో టీడీపీని పోటీలో పెట్టలేదు. దీంతో టీడీపీ కేడర్ ఓ సామాజికవర్గం ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడతాయని భావించారు. కుత్బుల్లాపూర్ తమ సామాజిక వర్గం ఓట్లు ఎక్కువ ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కొలను హన్మంత్‌రెడ్డి విజయం తథ్యమని చంద్రబాబుతో పాటు కాంగ్రెస్ నాయకులు సైతం భావించారు. కాని టీడీపీ ప్రభావం కాంగ్రెస్ అభ్యర్థిపై ఏ మాత్రం చూపించకపోవడంతో కాంగ్రెస్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్మయానికి గురవుతున్నారు. ఏకంగా బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ 85,576 ఓట్ల మెజార్టీతో రికార్డు సృష్టించాడు.

◆ బీజేపీతో పొత్తు పెట్టుకున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ తరఫున ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇక కొలను హన్మంత్‌రెడ్డికి కాంగ్రెస్ సంప్రదాయ ఓటింగ్‌తో పాటు అభిమానంతో వేసిన ఓట్లే తప్ప ఇరువురికి అటు జనసేన, కాని ఇటు టీడీపీల ప్రభావం కాని ఎక్కడా ప్రభావం చూపకపోవడంతో ఇరు పార్టీల అభ్యర్థులను విస్మయానికి గురి చేసింది.